

పాతబస్తీ దూద్‌బౌలిలోని బత్తిని సోదరుల ఇంటిలో పూజలు నిర్వహించిన అనంతరం వాహనంలో చేప ప్రసాదాన్ని దూద్‌బౌలి నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కు భారీ పోలిసు బందోబస్తు మధ్య తరలిస్తున్న దశ్యం



# హైదరాబాద్ వార్త



# చేప ప్రసాదం



-చేప ప్రసాదానికి పోటెత్తిన జనం
-ఏర్పాట్లను పరిశీలించిన నగర పోలీసు కమిషనర్ వి.సి సజ్జనార్
-భారీ పోలీసులు బందోబస్తు
-ప్రజలకు అల్పాహారం వడ్డిస్తున్న స్వచ్ఛంద సంస్థలు



**ప్రభాతవార్త, అబిడ్స్ ప్రతినిధి:**
నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో మృగశిర కార్తెను పురస్కరించుకుని బత్తిని సోదరులు ప్రతిసంవత్సరం నిర్వహించే ఆస్తమా రోగులకు అందించే చేప ప్రసాదానికి ప్రభుత్వం తరపున ఏర్పాట్లు చేయడం మూలంగా జనం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం తరపున స్వయంగా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలు, వివిధ విభాగాలకు చెందిన అధికారులను అప్రమత్తం చేయడం ద్వారా ప్రజలు ఏర్పాట్లపై సంతప్తిని వ్యక్తం చేశారు. రాత్రి 9గంటలకు చేప ప్రసాదం ప్రారంభం కావడంతో కలెక్టర్ మత్స్యశాఖ, ఆరోగ్యశాఖ, పోలీసు, జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి చేప ప్రసాదం పంపిణిని స్వయంగా మైదానంలో కలియ తిరిగి వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన ప్రజలతో ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కూడా సంతోషం వ్యక్తంచేశారు. హైదరాబాద్ మహానగరానికి వివిధ రాష్ట్రాలలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. 34 కౌంటర్లను ఏర్పాటు చేసి ఉబ్బసం వ్యాధిగ్రస్థులకు చేప ప్రసాదం ప్రాంతాన్ని పరిశీలించారు. లక్ష50 వేల కొరమెను చేపపిల్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు .జిహెచ్‌ఎంసి, ఆర్‌టిసి , ఫైర్‌సర్వీస్, వైద్య ఆరోగ్యశాఖ, జలమండలి పోలీసు, రెవెన్యూ, సమాచార పౌరసంబంధాలశాఖ, ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రజల ఆదరణ చూరగొన్నట్లు తెలిపారు. 5 తరాల నుండి బత్తిని సోదరులు తయారు చేస్తున్న చేపమందు ప్రసాదానికి చాలా గుర్తింపు వచ్చిందని బత్తిని అమర్‌నాథ్‌గౌడ్ అన్నారు. ప్రజల సౌకర్యార్థం స్వచ్ఛందసంస్థలు విశిష్టమైన సేవలు అందిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా ఏర్పాటు చేసిన అన్నదానం కౌంటర్లను సందర్శించి ప్రజలకు భోజనాన్ని వడ్డించారు. అన్ని కౌంటర్లను, క్యూలైన్లు, పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ రామకృష్ణతో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది ఉన్నారు. పంపిణి కార్యక్రమం సక్రమంగా జరిగే విధంగా పర్యవేక్షిస్తున్నారు.

**-చురుకుగా చేపట్టిన పారిశుధ్య పనులు డి.సి ఉమాప్రకాష్..**
నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదంలో భాగంగా నగర పాలక సంస్థ జోనల్ కమీషనర్ పి.ఉదయ్‌కుమార్ ఆద్వర్యంలో గోషామహల్ మహానగర పాలక సంస్థ డిప్యూటి కమీషనర్ ఉమా ప్రకాష్‌పర్యవేక్షణలో వివిధ రాష్ట్రాల నుంచే వచ్చే రోగులకు, వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, పరిశుభ్రత, పారిశుద్ధ విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ షిప్టుకు 25 మందిచొప్పున రెండు షిప్టులకు 50మంది పారిశుద్ధ్య కార్మికుల సహాయంతో రహదారులు. చెత్తాచెదారాన్ని ఎప్పటి కప్పుడు తొలగిస్తూ పారిశుద్ధ్య పనులు చేపట్టడుతున్నారు. ఇంజనీరింగ్ రూప, కలమ్మతదితరులు ఉన్నారు. కాగా లాఅండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు తమ విధులను నిర్వహించారు.



దూద్‌బౌలిలో తమ నివాసంలో సాంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు చేప ప్రసాదం పంపిణీ చేస్తున్న బత్తిని సోదరులు

## నీలోఫర్ ఆసుపత్రిలో వైద్యుల ఆందోళన..




**కార్వాన్, జూన్8, ప్రభాతవార్త :**
హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో రెసిడెంట్ డాక్టర్ జూన్ 6వ తేదీ శనివారం డ్యూటీలో ఉండగా డాక్టర్ నందన్ పై ఐదుగురు అటెండర్లు దాడి చేశారు. నీలోఫర్ ఆసుపత్రిలోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో శిశువును ఉంచినప్పుడు రోగి క్షేమంగా ఉన్నారని డాక్టర్ నందన్ అటెండర్‌లకు తెలియజేశారు. పాప ఏడుపు విన్న కుటుంబ సభ్యులు మళ్లీ యూనిట్‌లోకి ప్రవేశించి డాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. తల్లిని మాత్రమే ఎన్ఐసీయూలో ఉంచేందుకు అనుమతిస్తామని డాక్టర్ వివరించగా, అటెండర్లు పట్టించుకోలేదు. సహాయకులు ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు వైద్యుడిపై శారీరకంగా దాడి చేశారు. ఆ గందరగోళం మధ్య కార్యాలయంలో హెల్ప్‌లైన్ పనిచేయకపోవడంతో విధుల్లో ఉన్న వైద్యులు రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ ద్వారా పోలీసులకు వెంటనే సమాచారం అందించలేకపోయారు. కాగా ఈ దాడికి వ్యతిరేకంగా వైద్యులు మాకు న్యాయం కావాలి" అనే నినాదాలు చేస్తూ నిరసన తెలుపుతున్న వీడియోలు ఆన్‌లైన్‌లో షేర్ చేశారు. నీలోఫర్ హాస్పిటల్‌లో రెండో సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ రెసిడెంట్ డాక్టర్‌పై జరిగిన హింసాత్మక దాడిని తెలంగాణ హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డిఎ)తీవ్రంగా ఖండించింది. అన్ని ప్రభుత్వ వైద్య సదుపాయాలలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ని మోహరించాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. హెచ్‌ఆర్‌డిఎ విడుదల చేసిన ప్రకటన ప్రకారం రెసిడెంట్ డాక్టర్ రెస్పిరేటరీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఆర్ఐసియు)లో డ్యూటీలో ఉండగా ఈ ఘటన జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భముగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఆర్‌డిఎ సభ్యులు మాట్లాడుతూ.. ఐసియూ ప్రోటోకాల్‌లకు అనుగుణంగా రోగి భద్రత దృష్ట్యా డాక్టర్ కఠినంగా వ్యవహరిస్తున్నారని అసోసియేషన్ పేర్కొంది. అయినప్పటికీ వైద్య బృందానికి సహకరించడానికి బదులుగా రోగి యొక్క సహాయకులు వైద్యుడిపై శారీరక హింసకు పాల్పడరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడి ఖ్రూరమైనది, ఆమోదయోగ్యం కానిది గా పేర్కొన్నారు. వైద్య సిబ్బందిపై హింస ఆందోళనకరంగా పెరుగుతోందని హెచ్‌ఆర్‌డిఎ ఆగ్రహంతో ఆందోళన వ్యక్తం చేసింది.

## నిమ్స్ డైరక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌కు అభినందనల వెల్లువ

**జూబ్లీహిల్స్, జూన్ 8, ప్రభాతవార్తః**
నిమ్స్ నూతన డైరక్టర్‌గా నియమితులైన డాక్టర్ రాహుల్ దేవరాజ్‌ను పలు యూనియన్లు, సంఘాల ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. నిమ్స్ నర్సెస్ యూనియన్‌కు చెందిన ప్రిన్సిపల్ శ్రీనివాసులు, టెక్నికల్ కో-ఆర్డినేటర్స్ డాక్టర్ సుధ, డాక్టర్ పద్మిని, శైలజ, శ్రీనివాస్ ఆర్య, ఊమర్తి, శ్రీనివాస్ తదితరులు కలిసి డైరక్టర్‌ను సన్మానించారు. అలాగే నిమ్స్ రెవా నుంచి హరినాధబాబు, శరత్‌బాబు, రామరాజు తదితరులు కలిసి డాక్టర్ రాహుల్ దేవరాజ్‌ను సన్మానించారు.



నిమ్స్ డైరక్టర్‌కు పుష్పగుచ్చాలు అందిస్తున్న నిమ్స్ నర్సెస్ యూనియన్ సభ్యులు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించండి

-అదనపు కలెక్టర్ కదిరవన్ పలని

**హైదరాబాద్, జూన్ 8 , ప్రభాతవార్త:**
ప్రజలు వివిధ సమస్యలపై అందచేసిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కదిరవన్ పలని అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమా వేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, హౌసింగ్ పీడీ అశోక్ చక్రవర్తి , డిఆర్‌ఓ నారాయణలతో కలిసి పాల్గొని దర ఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగాకదిరవన్ పలని మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు అందచేసిన దరఖాస్తులను అధికారులు శాఖల వారీగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. తదుపరి సి.ఎం ప్రజావాణి అలాగే శాఖల వారీగా ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించి వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు 1166 అందాయని అందులో హౌసింగ్ శాఖకు సంబంధించి 980 అర్జీలు, పింఛ న్లు 162, రెవిన్యూ శాఖ 19, అలాగే ఇతర శాఖలు5 అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎం హెచ్ ఓ డాక్టర్ వెంకటి, జిల్లా సంక్షేమ అధికారులు జి. ఆశన్న, కోటాజి, ఇలియాస్ అహ్మద్, ఏవో విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ కదివరన్ పలని

## బంజారాహిల్స్ ఉదయ్‌నగర్‌లో పేలిన రిఫ్రిజిరేటర్

- ఇంట్లోని సామాగ్రి అగ్నికి ఆహుతి

**జూబ్లీహిల్స్, జూన్ 8, ప్రభాతవార్తః**
బంజారాహిల్స్ ఉదయ్ నగర్‌లోని ఒక ఇంట్లో రిఫ్రిజిరేటర్ పేలి ఇళ్లంతా బుగ్గి అయ్యింది. వివరాల్లోకి వెళితే.. ఉదయ్ నగర్‌లో నివసించే అమర్ సింగ్ ఇంట్లో సోమవారం ఉదయం రిఫ్రిజిరేటర్ శబ్దం చేసుకుంటూ పేలింది. మంటలు చెలరేగి అవి ఇళ్లంతా వ్యాపించాయి. ఇంట్లో ఉన్న అమర్‌సింగ్ అతని కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై బయటకు పరుగులు తీశారు. ఇంట్లోని సామాగ్రి మొత్తం ఆగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటనాస్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా నియంత్రించారు. అప్పటికే ఇంట్లోని సామాగ్రి మొత్తం కాలి బూడిదైంది. బీఆర్‌ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ధన్‌రాజ్ రాథోడ్‌లు వేర్వేరుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటానని మన్నె గోవర్ధన్‌రెడ్డి హామినివ్వడమే కాకుండా ఎమ్మార్వోతో మాట్లాడి వారికి అవసరమైన సాయాన్ని చేయాలని సూచించారు. ఇక ధన్‌రాజ్ రాథోడ్ బాధిత కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా రిఫ్రిజిరేటర్ పేలడం వల్ల ఈ సంఘటన జరిగిందా..? లేక మరేదైన కారణమా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.



సంఘటనాస్థలంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది

## ఇళ్లల్లో చోరీలు.. నిందితుడు అరెస్టు

రూ.26 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాల స్వాధీనం



నిందితుడిని అరెస్టు చేసి స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలను చూపిస్తున్న ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ డెబోరా, ఎస్ఐ ఫైసల్ అహ్మద్, పోలీసులు

**సరూర్‌నగర్, జూన్ 8 ప్రభాతవార్త:**
తాళం వేసిన ఇళ్ళను టార్గెట్‌గా చేసుకొని రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడే యువకుడిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్టు చేసి రూ.26 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం వైఎస్‌ఆర్ కడప జిల్లా చాపాడు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ఆకుమల్ల బాబా పీర్ అలియాస్ బాబా (20) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని రావిర్యాల గ్రామం హౌసింగ్ బోర్డు కాలనీలో నివసిస్తూ ఎసి మెకానిక్‌గా పని చేస్తుంటాడు. అయితే జల్సాలు చేయడానికి చోరీలు చేస్తుంటాడు. రాత్రి వేళల్లో నివాస ప్రాంతాల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్ళను గుర్తించి అదను చూసుకొని చాకచక్యంగా పూజ గది, ఇతర గదుల వెంటిలేషన్ అద్దాలను తొలగించి లోనికి ప్రవేశించి విలువైన సొత్తును దొంగిలిస్తుంటాడు. చోరీ సొత్తును హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బులతో జల్సాలకు, వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకుంటాడు. ఈ క్రమంలో పహాడీషరీఫ్ పిఎస్ పరిధిలో నివసించే కొల్హాపూర్ మండలం సున్నపు తాండాకు చెందిన నేనావత్ మల్లిఖార్జున్ ఇంటికి తాళం వేసి ఉండడాన్ని పసి గట్టిన బాబా చోరీకి పాల్పడి 17 తులాల బంగారు ఆభరణాలు, ఒక తులం బిస్కెట్ బంగారం, 20 తులాల వెండి బిస్కెట్లు, వెండి గొలుసులు అపహరించాడు. దీంతో బాధితుడు ఫిర్యాదు చేయడంతో రంగంలో దిగిన పహాడీ క్రైం టీం పోలీసులు చాకచక్యంగా దర్యాప్తు చేసి నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈవ మేరకు 166 గ్రాముల బంగారం, 257 గ్రాములు వెండి వస్తువులతో పాటు చోరీకి ఉపయోగించే స్క్రూడ్రైవర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ మొత్తం సుమారు రూ.26 లక్షలు ఉంటుందని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు నిందితుడిని సోమవారం రిమాండ్‌కు పంపారు. కాగా కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసిన పహాడీషరీఫ్ పోలీసు బృందాన్ని శంషాబాద్ జోన్ డిసిపి అభినందించారు.

## నాణ్యతలేమి పరికరాల వల్లే అగ్ని ప్రమాదాలు

-అక్రమాలకు ఆస్కారం లేదు..అంతా పారదర్శకమే
-నిర్ధేశిత గడువులోపే ఫైళ్లు క్లీయర్.. కొత్త అనుమతుల జారీ
-పీరియాడికల్ ఇన్స్‌పెక్షన్లతో భారీగా ఆదాయం
సీఈఐజీ నందకుమార్






**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:**
వరుస తనిఖీలతో పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, బహుళ అంతస్తుల భవనాల్లో విద్యుత్ ప్రమాదాలు తగ్గాయి. అధికారుల నిశిత పరిశీలన వల్ల కొత్తగా ఏర్పాటు చేసే సంస్థల్లో విద్యుత్ లైన్లు, సరఫరా వ్యవస్థ, భద్రతా ప్రమాణాలు మెరుగుపడ్డాయి అని చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్‌స్పెక్టరేట్ ఆఫ్ తెలంగాణ కె.నందకుమార్ స్పష్టం చేశారు. ఆ సీఈఐజీగా బాధ్యతలు స్వీకరించి, ఆగస్టుతో ఏడాది కాలం పూర్తి కాబోతోంది. ఆయన పనితీరుకు గుర్తింపుగా ప్రభుత్వం ఆయన పదవికాలన్నీ మరో ఏడాది పాటు పొడగించింది. ఈ సందర్భంగా పలు అంశా లను ఆయన మీడియాకు వెల్లడించారు. ఖర్చుతో పోలిస్తే..ఆదాయమే అధికమని గతంలో ఎన్నడూ లేని విధంగా తనిఖీలు, కొత్త కనెక్షన్లకు అనుమత ల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. కేవలం ఒక్క హెచ్‌టి కనెక్షన్ల ద్వారానే రూ.16 కోట్లు, సినిమా హాల్స్ ద్వారా రూ.7 కోట్ల ఆదాయం సమకూరింది. ఇక పీరియాడికల్ ఇన్సుపెక్షన్ల ద్వారా మరో రూ.3 కోట్ల ఆదాయం వచ్చింది. సీఈఐజీ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగుల వేతనాలు నిర్వహణ ఖర్చులకు ఏటా రూ.తొమ్మిది కోట్లు ఖర్చు అవుతుంది. ఈ విభాగానికి చేస్తున్న ఖర్చుతో పోలిస్తే..ప్రభుత్వానికి లభిస్తున్న ఆదాయమే అధికం. ముఖ్యంగా సీఈఐజీ విభాగంలో పారదర్శకతకు పెద్దపీత వేశాం. 89 మంది ఉద్యోగులతో ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశాం. ప్రతి రోజూ ఉదయం 8 గంట లకు అంతా కలిసి రోజూవారీ యాక్షన్ ప్లాన్ రూపొందించుకుంటున్నాం. ఎవరు? ఏ కంపెనీలో తనిఖీలకు వెళ్లారు? గుర్తించిన లోపాలు? వంటి అంశాలను రిజిస్టర్‌లో రికార్డు చేయిస్తున్నాం. వారంలో నాలుగు రోజుల్లో జిల్లాల్లో పర్యటించి, ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. తోటి ఉద్యోగుల పనితీరులోనూ మార్పు తీసుకొచ్చాం. అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్ధేశిత గడువులోగా ఫైళ్లు క్లీయర్ చేయిసున్నాం. దరఖాస్తు సహా విద్యుత్ లైన్లలో ఏదైనా షార్ట్‌పాల్ ఉంటే.. ముందే గమనించి, వాటిని సరి చేయిస్తున్నాం. వినియోగదారుల కోసం ఫోన్ నంబర్ః 040-23450367ను పునరుద్ధరించాం.

**ప్రమాణాలు పెంచి..ప్రమాదాలు నివారణ..**
హెచ్‌టీ కనెక్షన్ల కోసం అనుమతులు కోరుతూ ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తున్నాం. వినియోగదారుడు ఎంపిక చేసుకున్న లోడుకు తగ్గ ప్రమాణాల మేరకు లైన్లు, కేబుళ్లు, ఏబీ స్విచ్ బోర్డులు, ఎర్తింగ్ సిష్టం, ప్యానల్ బోర్డులు, ఫ్యూజ్ బాక్సులు, డీటీ ఆర్, బ్రేకర్, కండక్టర్ ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే అనుమతులు జారీ చేస్తున్నాం. క్షేత్రస్థాయి తనిఖీల్లో గుర్తించిన లోపాలను సరి చేసు కోవాల్సిందిగా సూచిస్తున్నాం. ఆ మేరకు మార్పులు, చేర్పులు చేసిన త ర్వాతే..అను మతులు జారీ చేస్తున్నాం. తద్వారా ఆయా పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో విద్యుత్ ప్రమాణాలను పెంచి, ప్రమాదాలను నియంత్రించేందుకు కృషి చేస్తున్నాం. తమ పనితీరును కర్ణాటక విద్యుత్ ఉన్నతస్థాయి కమిటీ సైతం అభినందించింది.

**అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి**
బీటెక్, పాలిటెక్నిక్, ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డులో (సూపర్ వైజర్, వైర్‌మెన్) పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. వివిధ పరిశ్రమల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తుంది. కొత్త కాంట్రాక్టర్లును ప్రోత్సహించేందుకు ఆన్‌లైన్ వేదికగా లైసెన్సులు జారీ చేయిస్తుంది.

## కారును ఢీకొటిన డిసిఎం

**అత్తాపూర్ జూన్ 8, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బుద్వేల్ రైల్వే స్టేషన్ సమీపంలో డిసిఎం, కారు ఢీకొన్నాయి. శంషాబాద్ నుండి ఆరాంఘర్ వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో డివైడర్‌పైకి కారు దూసుకెళ్లింది. దీంతో రోడ్డుపై ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేసి వాహనాల రాకపోకలు పునరుద్ధరణ చేశారు. అయితే ఈఘటనలో ఎలాంటి గాయాలు, ప్రాణనష్టం జరగలేదని కేవలం వాహనాలు దెబ్బతినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## ఫిల్మ్‌నగర్‌లో బిజెపి నేతల స్వచ్ఛభారత్



గౌతంనగర్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో బీజేపీ నేతలు.

**జూబ్లీహిల్స్, జూన్ 8, ప్రభాతవార్త:** ఈ నెల 10న మాజీ ఎమ్మెల్యే, ఖైరతాబాద్ నియోజకవర్గ బీజేపీ నాయకులు చింతల రాంచంద్రారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఫిల్మ్‌నగర్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఫిల్మ్‌నగర్ గౌతంనగర్‌లో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటస్వామి, ఫిల్మ్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వల్లెపు శంకర్, ఖైరతాబాద్ నియోజకవర్గ బీజేవైఎం కన్వీనర్ దండుగుల శేఖర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి దొంగరి రాజశేఖ, బీజేపీ నేతలు గుంటి ఆనందసాగర్, వరికెల్లి రాంబాబు, పురుషోత్తం, రమ్య, మంజుల, నర్సింహా, అశోక్ నాయక్ భీమయ్య, రాంబాబులు చీపుర్లు పట్టుకొని గౌతం నగర్ ప్రాంతంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు.

### ఉన్నత చదువులకు నిలయం హైస్కూల్ : అనిల్‌కుమార్ యాదవ్



అనిల్‌కుమార్‌యాదవ్‌ను కండువా కప్పి సన్మానించిన బ్రదర్ ఆంథోని పొలిశెట్టి, తదితరులతో కాంగ్రెస్ నాయకులు ఎన్.ధనరాజ్‌మాదిగ

**గన్‌ఫౌండ్రి, జూన్ 8ప్రభాతవార్త:** నగరం నడి బొడ్డున ఉన్న ఉన్నత విద్యాలయం లిటిల్‌ఫ్లవర్ అని,ఆ విద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతోపాటు క్రీడారంగంలో రాణించి చరిత్ర లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌కు మాత్రమే ఉందని రాజ్యసభ్యులు మండలి అనిల్ కుమార్‌యాదవ్ అన్నారు.సోమవారం అబిడ్స్ చిరాగ్‌అలీలైన్‌లో ఉన్న లిటిల్‌ఫ్లవర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా బ్రదర్ ఆంథోని పొలిశెట్టి అనిల్‌కుమార్‌యాదవ్‌ను కండువా కప్పి సన్మానించారు.ఈకార్యక్రమంలో ఖైరతాబాద్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎన్.ధనరాజ్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

### నాంపల్లి తహశీల్దార్ పరిధిని పెంచాలి : బద్దం సతీష్‌గౌడ్



ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందచేసిన ఖైరతాబాద్ కాంగ్రెస్ కార్యదర్శి బద్దం సతీష్‌గౌడ్, తదితరులు

**బేగంబజార్, జూన్ 8ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లా ఆర్.డి.ఓ పరిధిలోని ఆసిఫ్‌నగర్ తహసిల్దార్ పరిధిని తగ్గించి, నాంపల్లి తహసిల్దార్ పరిధిని పెంచాలని కోరుతూ ఖైరతాబాద్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిబద్దం సతీష్‌గౌడ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఆసిఫ్‌నగర్ తహసిల్దార్ పరిధిలో అనేక మైన ప్రాంతాలతోపాటు దాదాపు మూడు నియోజకవర్గాలతోపాటుఉందని, వైశాల్యంలో జనాభాలో సమస్యలతో అధికంగా ఉందన్నారు. గోషామహల్ నియోజకవర్గం యూనిట్‌గా పరిగిణిస్తూ నాంపల్లి తహశీల్దార్ పరిధిని విస్తరిస్తూ ,మంగళ్‌హాట్, దత్తాత్రేయనగర్ సంబంధితగోషామహల్ నియోజకవర్గంలో ఉందని, ఈప్రాంతాలను నాంపల్లి తహసిల్దార్ పరిధిలోకి వీలినం చేయాలని కలెక్టర్‌కు ఇచ్చిన పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజల వద్దకు చేరడంలోతీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్, హైదరాబాద్ ఆర్.డి.ఓ పరిశీలించి నాంపల్లి తహసిల్దార్ పరిధిని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుబాష్ లడ్డు, టి.సూరజ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు న్యాయం జరగాలి



నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

**సికింద్రాబాద్, జూన్ 8 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం సికింద్రాబాద్ పార్లమెంట్ కో ఆర్డినేటర్‌గా వై. ఉదయ్ కుమార్‌ను నియమిస్తూ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డా. చీమ శ్రీనివాస్ నియామక పత్రాన్ని జారీ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉదయ్ కుమార్ అందించిన సేవలను గుర్తించి, ఉద్యమ కారుల సంక్షేమం, సంస్థ బలోపేతం, జిల్లా వ్యాప్తంగా ఉద్యమ కారుల సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతంగా సేవలందించాలనే లక్ష్యంలో భాగంగా నియామకం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డా. చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమంలో నిస్వార్థంగా పనిచేసిన నాయకులకు సంస్థలో తగిన గుర్తింపు ఇవ్వడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఉదయ్ కుమార్ తన అనుభవంతో ఉద్యమ కారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ తన పై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ తెలంగాణ ఉద్యమ కారుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సంస్థ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. జిల్లా లోని ఉద్యమ కారులందరినీ ఒకే వేదిక పైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు ముదిరాజ్, దయానంద్, జగన్, లక్ష్మణ్, శ్రీని, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### సిబ్బంది మృతి పట్ల ప్రిన్సిపాల్,అధ్యాపక బృందం సంతాపం

**బేగంపేట జూన్ 8,ప్రభాతవార్త**

బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆఫీసు సబార్డినేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఇన్నారెడ్డి శనివారం రాత్రి అకాల మరణం చెందారు. ఆయన మృతి పట్ల మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.పద్మావతి, అధ్యాపక బృందం ఇన్నారెడ్డి సంతాప సభ నిర్వహించి ఆయన చిత్ర పటం వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.పద్మావతి మాట్లాడుతూ ఇన్నారెడ్డి విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసారని కొనియాడారు. ఆయన అకాల మరణం తమను ఎంతో బాధించిందన్నారు. ఉద్యోగులు బాధ్యతల నిర్వహణతో పాటు తమ ఆరోగ్యం విషయంలో కూడా శ్రద్ధ వహించాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఈ సంతాప కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.బాస్కరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దినేష్ శుక్లా, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని ఇన్నారెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## తెలుగు రాష్ట్రాలు దేశంలోనే నెంబరు వన్‌స్థాయికి ఎదగాలి : కుమార్ చౌదరి యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్‌చౌదరియాదవ్

**సైఫాబాద్, జూన్ 8 ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉభయ తెలుగు రాష్ట్రాలు ఐక్యం వర్థిల్లాలని పరిశ్రమలు, పాడి పంటలతో అభివృద్ధి చెంది దేశంలోనే నెంబరు-వన్ స్థాయికి ఎదగాలని సమైక్యాంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటి కుమార్ చౌదరియాదవ్ అకాంక్షించారు. చిన్న, చిన్న సమస్యలతో గొడవులు పడి అశాంతికి తావు ఇవ్వరాదని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రవారు, మర్వాడి గోబ్యాక్ నినాదాలకు స్వస్తి పలకాలని, అభివృద్ధిపైన దృష్టిని కేంద్రీకరించి కొత్త, కొత్త పరిశ్రమలు రావడానికి కృషి చేసి, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉభయ రాష్ట్రాల ప్రజలకు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. నినాదాలు చేసి మళ్ళీ బంచన్ దొర కాళ్లు మొక్కుతా అనే నిజాం నిరంకుశ సంస్కృతికి అవకాశం కల్పించరాదన్నారు. సర్దార్ వల్లభాయి పటేల్ హైదరాబాద్ స్టేట్ ముగింపుకు, భారతదేశంలో విలీనంకు సర్ధార్ వల్లభాయి పటేల్ ఎంతో కృషి చేశారని, ఇందుకోసం ఎంతో కష్టపడ్డారని ఆయన గుర్తు చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన పుచ్చపల్లి సుందరయ్య నైజాం నిరంకుశ పాలనుకు వ్యతిరేకరంగా ఉద్యమించారని, ఎన్టీఆర్ సిఎంగా ఉన్నప్పుడు ఉభయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కర్ఫ్యూలు పెట్టలేదని, పేద, మధ్య తరగతి ప్రజలతోపాటు అందరూ సుఖ సంతోషాలతో జీవించారని ఆయన గుర్తు చేశారు. క్రాంతిదళ్ పార్టీ నాయకుడు ప్రృధ్వీరాజ్ తెలంగాణలో లేని పోని మాటలతో ప్రజలను రెచ్చగొడుతున్నారని, ఆంధ్రవారికి కాంట్రాక్ట్‌లు ఇవ్వరాదు, భూములు విక్రయించరాదని వ్యాఖ్యలు చేస్తున్నారని, అలాంటప్పుడు కాశ్మీర్‌లో వలే ఆర్టికల్ 370 తీసుకురావాలని సవాల్ విసిరారు. అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాలలో ఏలాంటి గొడవలు లేవని, ప్రశాంతంగా ఉన్నాయని, బిహార్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి ప్రజలు ఇక్కడ వరి నాట్లు వేసుకుంటూ జీవిస్తున్నారని ఆయన వివరించారు. కొంత మంది వ్యక్తులు ఎపి డిసిఎం పవన్‌కళ్యాణ్‌పై పనిగట్టుకుని విమర్శలు చేయడం మంచిదికాదన్నారు. పవన్‌కళ్యాణ్ ఎపితోపాటు తెలంగాణ అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నారని స్పష్టం చేశారు. అసరమైతే తెలంగాణలో పవన్‌కళ్యాణ్‌తో ఒక బహిరంగసభను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

## నాణ్యతతో సిసి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి: పావని వినయ్ కుమార్



మాల బస్తీలో సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి , జూన్ 8 ( ప్రభాతవార్త ) :** గాంధీనగర్ డివిజన్ పరిధిలోని మాల బస్తీలో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం స్థానిక మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ నిధులు రూ. 2 కోట్ల నుంచి ఈ పనుల కోసం రూ. 10 లక్షలను గతంలోనే కేటాయించి, పనులను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ... మాల బస్తీలో చాలా ఏళ్ల క్రితం వేసిన షాబాద్ బండలు పూర్తిగా దెబ్బతిని, స్థానికులు కనీసం నడవలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. బస్తీ నాయకులు, ప్రజల విజ్ఞప్తి మేరకు స్పందించి గతంలోనే నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు. పనుల్లో పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, బస్తీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులను పూర్తి చేసి రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు దామోదర్, మదన్‌మోహన్, అరుణ్ కుమార్, గోపి, శివకృష్ణ, బస్తీ నాయకులు జీ.ఎస్. మధుసూదన్, జీ.విజయ్ కుమార్, సునీల్ కుమార్, రమేష్, రాహుల్ మరియు బస్తీ మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

## దోపిడీ కోసం హత్య చేసిన ఇద్దరి అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ రక్షితా మూర్తి

**తార్నాక, జూన్ 8 ప్రభాతవార్త :** దోపిడీ కోసం ఓ వ్యక్తిని హత్య చేసిన ఇద్దరు నిందితులను లాలాగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకు గురైన వ్యక్తి వద్ద పెద్ద మొత్తంలో డబ్బు ఉందనుకొని అతనిని హత్య చేశారు. కాని అతని వద్ద కేలం రూ. 110 మాత్రమే లబించింది. నగదు మరియు మొబైల్ కోసం దాడి చేసి హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. సికింద్రాబాద్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వడ్ వైభవ్ రఘునాథ్ సోమవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులు హత్య చేసిన వివరాలను వెల్లడించారు. తుకారాంగేట్‌కు చెందిన ధాబీ వినోద్ (30), అడ్డగుట్టకు చెందిన మక్కల మోహన్ (19)లను అదుపులోకి తీసుకుని, మృతుడి మొబైల్ ఫోన్‌తో పాటు నేరానికి ఉపయోగించిన ఈబైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్‌కు రాష్ట్రం బాలాఘాట్ జిల్లాకు చెందిన జై ప్రకాష్ దేశ్‌ముఖ్ (38) భవన నిర్మాణ కార్మికుడు. ఈనెల 2న మియాపూర్‌లో తన సోదరుడి వద్దకు వెళ్లేందుకు మొండా మార్కెట్ వద్ద ఒంటరిగా నిలబడ్డాడు. అదే సమయంలో డెలివరీ బాయ్ ధాబీ వినోద్, మక్కల మోన్ ఇంటరిగా వెళ్లే వారిని దోచుకోవాలనే స్కెచ్‌తో ఎలక్ట్రిక్ బైక్ పై అక్కడికి వచ్చాడు. ఒంటరిగా ఉన్న జై ప్రకాష్‌ను గమనించి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దించుతామని నమ్మించి వారి బైక్ పై ఎక్కించుకున్నారు. నిర్మానుష్యంగా ఉన్న తుకారాంగేట్ రైల్వే బ్రిడ్జి సమీపం వద్దకు అతనిని తీసుకొచ్చారు. అతనిని భెదిరించి అతని జేబులో ఉన్న నగదును ఇవ్వాలని, ఇతర వస్తువులు ఇవ్వాలని బెదిరించారు. అతను ప్రతిగటించడంతో అతని పై బండరాయితో తలపై కొట్టి హత్య చేశారు. కాని అతని వద్ద కేవలం రూ. 110 మాత్రమే దొరికాయి. దీంతో ఈ నెల 3న ఉదయం మృతదేహాన్ని చేసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీసీటీవీ ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాల సహాయంతో కేసును ఛేదించిన పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

### రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సభ్యత్వ నమోదు కమిటీ చైర్మన్‌గా రాజశేఖర్ గుప్తా



**చిక్కడపల్లి జూన్ 8 (ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సభ్యత్వ నమోదు కమిటీ చైర్మన్ గా సంఘం సీనియర్ నాయకులు, రాంనగర్ ఆర్యవైశ్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాసన గొట్టు రాజశేఖర్ గుప్తా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని మహాసభ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అమరవాది లక్ష్మీనారాయణ, కొండ్లె మల్లికార్జునులు సోమవారం ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన రామ్ నగర్ లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మహాసభ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి సభ్యత్వ నమోదును విరివిగా చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ పదవి ఇచ్చినందుకు మహాసభ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు ఈ సందర్భంగా రాజశేఖర్ గుప్తా కృతజ్ఞతలు తెలియజేశారు.

### అకారణంగా సస్పెన్షన్‌కు గురి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : ఎంపిడిఓ

**సైఫాబాద్, జూన్ 8 ప్రభాతవార్త:** కొంత మంది అధికారులు ఉద్దేశపూర్వకంగా తనని మానసిక క్షోభకు గురిచేసి, ఉద్యోగం నుంచి తొలగించాలని కుట్ర పన్నుతున్నారని, అనధికారికంగా సస్పెన్షన్‌కు గురి చేశారని కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట ఎంపిడిఓ డి.లలితాకుమారి ఆరోపించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ఏడాది గ్రామ పంచాయితీ ఎన్నికల్లో నామినేషన్‌లు సందర్భంగా సంఖ్యను తప్పుగా రిపోర్ట్ చేయడం జరిగిందని, డిసెంబరు 3వ తేదీ అర్ధరాత్రి తనని సస్పెన్షన్ చేస్తూ ఒక అధికారి వాట్సప్ చేయడం జరిగిందని ఆరోపించారు. ఈ వాట్సాప్ మేసేజ్‌కు ఏలాంటి అధికారి సంతకం లేదని, ఇది నకిలి మేసేజ్ అని స్పష్టం చేశారు. ఈ సస్పెన్షన్ చెల్లుబాటు కాదని, సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికి తనకు వేతనంలో 50 శాతం మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన సర్వీస్‌కు సంబంధించి హెచ్‌ఆర్ అప్రూవల్, డిడిఓ యాక్సెస్, సర్వీస్ బెనిఫిట్స్ జీతభత్యాలు ఆన్‌లైన్‌లో ఇవ్వకుండా అధికారులు తనని మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని ఆమె ఆరోపించారు. ఈ విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని నిందితులపై తగిన చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ముష్కిన్ చెరువు అభివృద్ధికి నిధులు ఇవ్వాలి



నార్సింగిలోని ముష్కిన్ చెరువు అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రంను ఇస్తున్న బిజెపి నాయకులు.

**నార్సింగి, జూన్ 8 ప్రభాతవార్త :** నార్సింగి సర్కిల్ పరిధిలోని ముష్కిన్ చెరువు అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరుతూ సోమవారం చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వ ర్‌రెడ్డికి నార్సింగి సర్కిల్ బిజెపి అధ్యక్షులు మెండె నాగేష్ వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడుతూ ఇటీవల హైడ్రా అధికారులు ముష్కిన్ చెరువులోని అక్రమ కట్టడాలు తొలగించి, చెరువును కబ్జా చెర నుంచి విడిపించారని తెలిపారు. హైడ్రా అధికారులు చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తారని, చెరువు అభివృద్ధికి ఎంపి నిధులుగాని, రాష్ట్ర ప్రభుత్వం నిధులు గాని ఇప్పించాలని ఎంపిని కోరామని వివరించారు. కోట్ల రూపాయల విలువ చేసే చెరువులను భావి తరాలకు అందించేందుకు, సుందరీకరించేందుకు నిధులు అడిగామన్నారు. ఇందుకు స్పందించిన ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తో ఈ విషయంపై మాట్లాడుతానని, నిధులు వచ్చేలా నావంతు కృషి చేస్తానని హామీనిచ్చారని నాగేష్ తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీనియర్ నాయకులు అంజన్ కుమార్‌గౌడ్, కెఎస్.రత్నం, లక్ష్మీనారాయణ, జైపాల్‌రెడ్డి, శివరాజ్ తదితరులు ఉన్నారు.

### 11న యూకే విద్యా ఉపాధి అవకాశాలపై సెమినార్

**-గ్లోబల్ ట్రీ వ్యవస్థాపకులు శ్రీకర్ ఆలపాటి**

**హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త:** జూన్ 11 బంజారాహిల్స్‌లోని ముఫకంజా కళాశాలలో యూకేలో విద్యా, ఉపాధి అవకాశాల పై సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ ట్రీ వ్యవస్థాపకులు శ్రీకర్ ఆలపాటి తెలిపారు. ఈమేరకు సోమవారం సోమాజీగూడలోని సంస్థ కార్యాలయంలో సోమవారం ఇందుకు సంభందించిన గోడ పత్రిని సంస్థ సభ్యులు నమ్రత ,సుధీర్, తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్లోబల్ ట్రీ సంస్థ నిర్వహించే ఉచిత సెమినార్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్రిటీష్ డిప్యూటి హై కమీషనర్ గార్థెన్ విన్ ఓవెన్, యూకే పార్లమెంట్ మాజీ సభ్యులు వీరేంద్ర కుమార్ శర్మ, సనమ్ అరోరాలు హాజరు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత చదువులకు యూకే వెళ్లే ఒక విద్యార్థికి లక్కీ డీప్ ద్వారా రూ. 2.50 లక్షల ఉచిత స్కాలర్ షిప్‌ను అతిథుల చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. యూకేకు ఉన్నత చదువులకు, ఉద్యోగాల కోసం వెళ్లే అభ్యార్థులకు ఉచిత స్కాలర్ షిప్ సౌకర్యంతో పాటు బ్యాంకు రుణాలు సైతం సంస్థ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



వివరాలు వెల్లడిస్తున్న శ్రీకర్, నమ్రత, సుధీర్ తదితరులు

## దేశప్రజల సంఘటిత శక్తితోనే జాతికి వైభవం

**-హైకోర్టు న్యాయవాది నారుమంచి అనంతకృష్ణశర్మ**



సభలో పాల్గొన్న అనంతకృష్ణశర్మ, ఫణీంద్ర, రాధశ్రీ, నరసింహాచార్య తదితర అతిథులు

**నాంపల్లి, జూన్ 8 ప్రభాతవార్త :** దేశ, సమాజహితం కోసం ప్రజలంతా సంఘటిత శక్తితో కృషిచేస్తేనే జాతికి వైభవం చేకూరుతుందని ప్రఖ్యాత హైకోర్టు న్యాయవాది, సంస్కృతాంధ్ర సాహితీమూర్తి నారుమంచి అనంతకృష్ణశర్మ అన్నారు. యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, డిఎవిఎన్.మూర్తి స్మారక సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య ఫణీంద్ర సభాధ్యక్షతన శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలోని డా. రావిచెట్టు రంగారావు కళావేదికలో తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాలు-21వ సమావేశానికి అనంతకృష్ణశర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత స్పందించి సమాజహిత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పాశ్చాత్య ధోరణులకు అతీతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి కృష్ణపక్షం కావ్య సమాలోచన డా. రాధశ్రీ; డిఎవిఎన్.మూర్తి సాహిత్య సౌరభం అంశంపై మావుదూరు సూర్యనారాయణ మూర్తిలు సమగ్రంగా ప్రసంగించారు. సభకు సాధన నరసింహాచార్య, హనుమంతరావులు స్వాగతం పలుకగా ఆచార్య వంగపల్లి విశ్వనాథం, దుగ్గిరాల వాసుదేవరావులు ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. సభకుముందు బాలవిద్యార్థుల యత్ర నార్యస్తు పూజ్యంతే సాహిత్య సంగీత రూపకం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుని తన్మయుల్ని చేసింది.

## నీటి కోసం రోడ్డుపై బిందెలతో మహిళలు నిరసన



బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న బస్తీ మహిళలు.

**యూసుఫ్‌గూడ 8 జూన్, ప్రభాతవార్త :** వేసవిలో త్రాగేందుకు గుక్కెడు నీరు కూడా తమకు అందటం లేదంటూ పర్వత్‌నగర్ బస్తీలోని మహిళలు బిందెలతో నిరసన తెలిపారు. గత నెల రోజులుగా నిత్యం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో పాటు కనీసం తమకు నీటి ట్యాంకర్ల ద్వారా మంచినీరును అధికారులు అందివ్వడం లేదని తాము నీటి కోసం ఎక్కడికి వెళ్లాలని మహిళలు ప్రశ్నిస్తున్నారు. సోమవారం పెద్ద ఎత్తున గాయిత్రినగర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌కు చెందిన మహిళలు ఏకంగా బిందెలతో రోడ్డు పైకి వచ్చారు. ఎన్నిసార్లు అధికారులకు ప్రజా ప్రతినిధులకు, స్థానిక సంక్షేమ సంఘం నాయకులకు మొరపెట్టుకున్నా వారు తమ సమస్యను ఏమాత్రం పట్టించుకోక పోగా నిర్లక్ష్యపు సమాధానం చెబుతూ మాట దాటేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తమకు వాడుకునేందుకు బోర్లు కూడా లేవని ప్రభుత్వం తరఫున ప్రజలకు అందుబాటులో పవర్ బోర్‌వెల్‌లు ఏర్పాటు చేస్తే కనీసం వేసవిలో వాడుకునేందుకు నీరు అందుబాటులో ఉండేదని తమకు ఆ సౌకర్యం కూడా లేవన్నారు. నీటి సరఫరా సక్రమంగా వదలక పోవడంతో తామంతా కూలిపని చేసుకుని జీవిస్తున్నామని మంచినీటి పైప్‌లైన్లలో నీరు ఎప్పుడు సరఫరా అవుతదో తాము కళ్ల కాయలు కాసేలా ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమకు తాగేందుకు నీటి సరఫరా అయ్యేలా చూడలని కోరారు.

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన సాయికీర్త్

**చిక్కడపల్లి జూన్ 8 ( ప్రభాతవార్త ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బింగి సాయికీర్త్ (బాబ్జి) సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో పార్టీ బలోపేతానికి చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఆయన ఉప ముఖ్యమంత్రికి వివరించారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిరంతరం ప్రజల్లోకి తీసుకువెళ్తున్నట్లు సాయికీర్త్ ఈ సందర్భంగా తెలిపారు. డివిజన్ లోని ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు, ప్రభుత్వ లబ్ధిని అర్హులకు చేరవేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం శ్రమిస్తున్నాయని పేర్కొన్నారు. కాగా, పార్టీ కార్యక్రమాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా సాయికీర్త్‌కు సూచించారు.

### కిషన్ రెడ్డిని కలిసిన పార్థసారథి



**చిక్కడపల్లి జూన్ 8, ప్రభాతవార్త :** త్వరలో జరగబోయే జిహెచ్ ఎం సి ఎన్నికల నాటికి బీజేపీ పార్టీని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలనీ కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి కోరారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సి. పార్థసారథి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వ ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలనీ కోరారు. ముషీరాబాద్ నియోజకకవర్గంలో బీజేపీ కి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేయాలనీ కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ కలకోట అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ బిసి కమిషన్ చైర్మన్‌ను కలిసిన వేముల లోకేష్

**- దేశవ్యాప్తంగా ఉన్న వడ్డెరుల సమస్యలపై చర్చ**



బిసి కమిషన్ చైర్మన్‌తో సమావేశమై వేముల లోకేష్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 8,ప్రభాతవార్త:** జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్‌పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతిను, అఖిలభారత వడ్డెర సంఘం నేషనల్ యూత్ ప్రెసిడెంట్ డా. లోకేష్ వేముల కలిశారు. ఈమేరకు సోమవారం ఢీల్లిలోని సాధ్వి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వడ్డెర సమాజానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వడ్డెర సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, విద్యా, ఆర్థిక సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వడ్డెరలకు న్యాయమైన అవకాశాలు, సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. అలాగే దేశవ్యాప్తంగా వడ్డెర సమాజ యువతకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వడ్డెర సమాజ హక్కుల సాధన, అభ్యున్నతి కోసం అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని డా. లోకేష్ వేముల పేర్కొన్నారు.

### రాజకీయ నాయకుడి ఇంట్లో చోరీ ప్రచారం..

**-చివరికి కుటుంబ వ్యవహారమే!**

**సంజీవరెడ్డి నగర్, జూన్ 8, ప్రభాతవార్త:** సనత్‌నగర్ ప్రాంతంలో ఓ రాజకీయ నాయకుడి ఇంట్లో భారీ చోరీ జరిగిందన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికంగా కలకలం రేగింది. కోటిన్నర రూపాయల నగదు మాయమైనట్లు ప్రచారం జరిగినప్పటికీ, ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని సమాచారం. వివరాల్లోకి వెళితే, సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జేకే కాలనీలో నివసించే ఓ రాజకీయ పార్టీ నాయకుడు తన ఇంట్లో నిల్వ ఉంచిన నగదు కనిపించడం లేదని పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఇంట్లో త్వరలో జరగనున్న వివాహ కార్యక్రమం కోసం సుమారు రూ.1.5 కోట్లు నగదును అల్మారాలో భద్రపరిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం కొంత మొత్తాన్ని అవసరార్థం తీసుకోవడానికి ప్రయత్నించగా నగదు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన నాయకుడు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. అయితే పోలీసుల ప్రాథమిక విచారణలో ఆ నగదును కుటుంబ సభ్యుల్లో ఒకరైన ఆయన కుమార్తె తీసినట్లు వెల్లడైంది. దీంతో చోరీ జరిగిందన్న అనుమానాలు తొలగిపోయాయి. ఇది కుటుంబానికి సంబంధించిన అంతర్గత వ్యవహారమని, తామే పరిష్కరించుకుంటామని సదరు నాయకుడు పోలీసులకు తెలియజేయడంతో వారు వెనుదిరిగారు. ఈ ఘటనపై ఎలాంటి లిఖితపూర్వక ఫిర్యాదు నమోదు కాలేదు.

### పంజాగుట్టలో రెండు స్పా సెంటర్లపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జూన్ 8, ప్రభాతవార్తః** పంజాగుట్టలో రెండు స్పా సెంటర్లపై పంజాగుట్ట పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. సోమాజీగూడలోని రాజ్‌భవన్ రోడ్‌లో ఉన్న స్వస్తిక్ ఆయుర్వేద వెల్నెస్ కేంద్రంతోపాటు, శ్రీనగర్‌కాలనీలోని చాప్‌స్టిక్స్ రెస్టారెంట్ వెనుక భాగంలో ఉన్న ఆర్ ఎల్స్ హెల్త్ అండ్ బ్యూటీ స్పాపై ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు స్పా కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నట్లు గుర్తించారు. స్పా సెంటర్లలో నిబంధనల ప్రకారం థెరిపిస్టులు లేకపోవడం, సీసీటీవీలు ఏర్పాటుచేయకపోవడం, గుర్తింపు పొందిన వైద్యులు, ఫిజియో థెరిస్టులు లేకపోవడం, నిర్వహణ లోపం ఉన్నట్లు గుర్తించారు. దీంతో స్వస్తిక్ ఆయుర్వేద వెల్నెస్ సెంటర్ టెలికాలర్‌గా పనిచేస్తున్న అర్పితా మెత్రే, మేనేజర్, సబ్ ఆర్గనైజర్ భానుప్రసాద్‌లతోపాటు కస్టమర్లుగా ఉన్న సూరాడి రవి, మహ్మద్ ఇర్ఫాన్, ఆలూరి చంద్రకాంత్, మహ్మద్ బిన్ నాజర్ అలీ యఫై, ముగ్గురు థెరిపిస్టులను అదుపులోకి తీసుకొన్నారు. స్పా నిర్వాహకురాలైన మోహిని రావు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపా రు. ఇక ఆర్ ఎల్స్ హెల్త్ అండ్ బ్యూటీ స్పా మేనేజర్ షాలి యన్ ఇంకా, మణిపూర్, మిజోరంకు చెందిన ఇద్దరు థెరిపిస్టులను అదుపులోకి తీసుకొన్నారు. ఈ రెండు స్పాకేంద్రాలపై కేసులు నమోదు చేసి పంజాగుట్ట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### నమ్మించి బంగారు ఆభరణాలు కాజేసిన నిందితుడు అరెస్ట్

**జూబ్లీహిల్స్, జూన్ 8, ప్రభాతవార్తః** స్నేహం పేరుతో నమ్మించి ఆభరణాలను కాజేసిన వ్యక్తిని జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ డిఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. గచ్చిబౌలికి చెందిన విశ్రాంత ఉద్యోగి రాజం రాజయ్య ప్రకాష్(70)కు రాములు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని ఆసరాగా చేసుకున్న రాములు, బంగారు ఆభరణాలను జ్యువెలరీ దుకాణంలో తాకట్టు పెడితే అధిక రుణం ఇప్పిస్తానని నమ్మించాడు. రాజయ్య ప్రకాశ్‌కు చెందిన 62 గ్రాముల బంగారు ఆభరణాలున్న బ్యాగ్‌ను తీసుకుని రాములు పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన క్రైం పోలీసులు సోమవారం జూబ్లీహిల్స్ రోడ్ నం.5 మెట్రో స్టేషన్ సమీపంలో నిందితుడు అబ్దుల్లాపురం చిన్నయ్య అలియాస్ రాములు(60) ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకొన్నారు. అతన్ని నిజామాబాద్ జిల్లా వెంకల్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో అతని వద్ద నుంచి మొత్తం 57.66 గ్రాముల బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు అతడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది.

### భవనంపై నుండి దూకి గుర్తుతెలియని యువకుడు మృతి

**వనస్థలిపురం జూన్8,ప్రభాతవార్త :** భవనం పై నుండి దూకి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎం .ఈ .రెడ్డి గార్డెన్ ఎదురుగా ఉన్న నమి శ్రీ హై రైజ్ భవనం వద్ద సోమవారం తెల్లవారుజామున రక్తస్రావంలో పడిఉన్న యువకుడి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కానీ అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. పోలీసులు చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. మృతుడు ఆదివారం రాత్రి సుమారు 9:30 సమయంలో పక్కన ఉన్న ఉడిపి హోటల్లో భోజనం చేసినట్లు రికార్డయింది. అనంతరం రెండంతస్తుల బిల్డింగ్ పైకి ఎక్కి నమిశ్రీ భవనంలోకి ఎలా వెళ్లాలో గమనించిన అనంతరం సుమారు 10 గంటల సమయంలో బిల్డింగ్ లోనికి వెళ్ళాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వంజరి సామాజిక వర్గానికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి సేవలు అభినందనీయం : వంజరి ప్రవీణ్



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన వంజరి సంఘం రాష్ట్ర నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే బృందం

**కుషాయిగూడ ,జూన్ 8,ప్రభాతవార్త**

వంజర సామాజిక వర్గానికి భవన నిర్మాణం ఏర్పాటుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సేవలు వంజరి సామాజిక వర్గం మర్చిపోదని వంజర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే పేర్కొన్నారు. ఉప్పల్ బాగా ఎత్తులో అత్యంత అద్భుతంగా నిర్మించిన వంజర ఆత్మగౌరవ భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా వంజరి ప్రవీణ్ బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. కుల మత వర్గ రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి చేస్తున్న సహాయాన్ని మర్చిపోలేమన్నారు. సమాజాభివృద్ధి ఐక్యత సామాజిక గౌరవానికి వంజరి భవనం ఒక మైలురాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బంజర సంఘం రాష్ట్ర కాప్రా నాయకులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**మల్కాజిగిరి జూన్ 8,ప్రభాతవార్త**

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ లో 20 లక్షల రూపాయల తో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాబు సత్యనారాయణ సంపత్ రావు పోతుల వినోద్ యాదవ్ నరసింహ షకీల్ యాకూబ్ మైముదా మేడం మహమ్మద్ బాహార్ కాలనీవాసులు సత్యనారాయణ రాజు యాదవ్ బిక్షపతి మధు యాదవ్, యూసుఫ్ భాయి షాయద్ లక్ష్మ ఆంటీ జ్యోతి కళ అనిత అంజమ్మ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు

## మలక్ పేట ఈస్ట్ జోన్ ఆర్టీఓగా రఘునందన్ గౌడ్



**మలక్ పేట, జూన్ 8, ప్రభాతవార్త:** మలక్ పేట ఈస్ట్ జోన్ ఆర్టీఓ గా రఘునందన్ గౌడ్ బాధ్యతలు చేపట్టారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా రవాణా శాఖ అధికారిగా విధులు నిర్వహించిన రఘునందన్ గౌడ్ బదిలీపై మలక్ పేట ఈస్ట్ జోన్ ఆర్టీఓ గా బాధ్యతలు స్వీకరించారు. మలక్ పేట ఆర్టీఓ గా విధులు నిర్వహించిన లెక్కల కిష్టయ్య ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. బి బ్లాక్స్ లోని ఆర్టీఓ కార్యాలయంలో ఈ సందర్భంగా రఘునందన్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి మెరుగైన సేవలను అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వాహనదారులు ఖచ్చితంగా ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు.

## జలమండలి కార్యాలయంలో ఘనంగా సంబురాలు



కార్యాలయంలో సంబురాలు నిర్వహిస్తున్న జలమండలి సిబ్బంది,నాయకులు

**మలక్ పేట, జూన్ 8, ప్రభాతవార్త:**

జలమండలి యూనియన్ ఎన్నికల్లో మొగుల రాజిరెడ్డి విజయం సాధించడంతో మలక్ పేట జలమండలి కార్యాలయంలో కార్మికులు, సిబ్బంది సంబురాలు నిర్వహించి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌకి రవికుమార్, బాబు శ్రీనివాస్, తాటికొండ శ్యామ్, ముప్పిడి శ్రీనివాస్, వాజపేయి, భీక్షపతి, దశరథ్, సాయిలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలాస్ కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న బిఆర్ఎస్ నాయకులు పగిళ్ల నర్సింగ్, పగిళ్ల శ్రీనివాసరెడ్డి బి.యన్. రాజు తదితరులు

**మలక్ పేట, జూన్ 8, ప్రభాతవార్త:** ఫీజులు పెంచి ఇష్ట రాజ్యాంగా వ్యవహరిస్తున్న పలు ప్రైవేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని బిఆర్ఎస్ నాయకులు పగిళ్ల నర్సింగ్, పగిళ్ల శ్రీనివాసరెడ్డి, బి.ఎన్. రాజులు పేర్కొన్నారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలాస్ కు వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రైవేట్ పాఠశాలలో ఎటువంటి చట్టపరమైన ఆదేశాలను పాటించకుండా ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచి విద్య పేరుతో దోచుకుంటున్నారని ఆరోపించారు. అదేవిధంగా పలు ప్రైవేట్ పాఠశాలలు చట్ట విరుద్ధంగా తమ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ లను కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందుల గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. వెంటనే ఇటువంటి ప్రైవేట్ పాఠశాలలపై తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

# ఫ్యూచర్ సిటీలో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి చిత్రంలో కేఎల్ఆర్, పున్న గణేష్‌నేత

**ఎల్.బి.నగర్, జూన్ 8 ప్రభాతవార్త:**

ఫ్యూచర్ సిటీలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంగళవారం డెవలప్మెంట్ అథారిటీ, స్కిల్ యూనివర్సిటీల ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయడమే లక్ష్యంగా రామకృష్ణ పురం, ఎన్టీఆర్‌నగర్, సరూర్నగర్, డాక్టర్స్ కాలనీ డివిజన్ల ముఖ్యనాయకుల విస్తృతస్థాయి సమావేశం కొత్తపేటలో రామకృష్ణాపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసి మెంబర్ దేప భాస్కర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగంగా డెవలప్మెంట్ అథారిటీ, స్కిల్ యూనివర్సిటీల ప్రారంభోత్సవానికి తరలి వస్తున్న ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం నుండి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోయిని మహేందర్ యాదవ్, వక్కలంక శ్రీనివాసరావు, ఎస్.కె.మహమ్మద్, బండి మధుసూదన్‌రావు, ధనరాజ్‌గౌడ్, సురేష్, తలాటి రమేష్‌నేత, దయాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శంకర్‌యాదవ్, రామకృష్ణగౌడ్, బొడ్డుపల్లి మహేందర్, యాదవరెడ్డి, రాజునాయక్, పగడాల ఎల్లయ్య, గుల్షన్, శ్రీనివాస్, యూనుస్, దుబ్బాక శేఖర్, అంజిరెడ్డి, జ్ఞానేశ్వర్‌యాదవ్, శేఖర్‌ముదిరాజ్, పగడాల శ్రీశైలం, అల్లేటి కిరణ్, జంగారెడ్డి, కిషోర్, సుదర్శన్, రమేష్‌గౌడ్, జగన్నాథం, భాస్కర్, షఫీ, పాషా, రంజిత్, రేణుక, అరుణ, సుజాతరెడ్డి, సంగీత, మాధవి మమత, లావణ్య, రామ పాల్గొన్నారు.

## అన్ని రంగాలలో విజయ స్కూల్ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కుషాయిగూడ జూన్ 8, ప్రభాతవార్త**

విద్యతోపాటు అన్ని రంగాలలో విద్యార్థుల్లో దాగి ఉన్న మెలకువలను నైపుణ్యాలను వెలికితీయస్తూ తీర్చిదిద్దుతున్న విజయ హై స్కూల్ సేవలను ఉప్పల్ ఎమ్మెల్యే వండారు లక్ష్మారెడ్డి అభినందించారు. అద్భుతమైన ప్రతిభ కనబరిచిన ఉత్తమమైన మార్కులు పొందిన విద్యార్థులకు నగదు పారితోషకం ఇస్తున్న కరస్పాండెంట్ రాజేష్ నిర్ణయాన్ని కొనియాడారు.మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్ పరిధిలోని విజయ హై స్కూల్లో పదవ తరగతి విద్యార్థుల విజయోత్సవ సంబరాలు విజయ హైస్కూల్ ఆదిత్య నగర్ కాప్రాలో పదవ తరగతి విద్యార్థులు ఫలితాల ప్రభంజనం సృష్టించిన తరుణంలో విజయోత్సవ సభను పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ఆశీర్వచనాలను అందిస్తూ..విజయ హై స్కూల్లో అభ్యసించిన విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. విద్యలో ఉత్తమప్రతిభను కనబరచిన ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకుతన వంతు అన్ని రకాలుగా సహాయసహకారాలను అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు పాఠశాల టాపర్ గా నిలిచిన సాహితీ 584 మార్కులు ఎమ్మెల్యే చేతుల మీదుగా 10,000 రూపాయలను,మేఘనాలహరి 582 మార్కులు 7500రూపాయలు, వరునిక 579 మార్కులు 5000 రూపాయలతో పాటు శాలువ, మెమంటోలతో సత్కరించారు. 500మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు 92 మందికి జ్ఞాపికలు, శాలువాలతో యాజమాన్యం ఘనంగా సన్మానించారు. పాఠశాల చైర్మన్ కొప్పునూరి బసప్ప మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో దేశౌన్నత్యాన్ని చాటుతూ దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. ఇంతటి ఫలితాలు సాధించడానికి కారకులైన ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి, సీనియర్ మైనారిటీ కాప్రా ప్రెసిడెంట్ బద్రుద్దీన్, కాప్రా టీఆర్ఎస్ యూత్ లీడర్ నరేష్ గౌడ్, ఆర్ ఎస్ యూత్ లీడర్ మహేష్ గౌడ్,పాఠశాల చైర్మన్ కొప్పునూరి బసప్ప,వ్యవస్థాపకురాలు శ్రీమతి విజయలక్ష్మి, విజయ ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ శెట్టి చంద్రశేఖర్, పాఠశాల సభ్యులు రాజశేఖర్ ప్రభు, కరస్పాండెంట్ కొప్పునూరి రాజేశ్వర్, డైరెక్టర్ కొప్పునూరి వీణ, ప్రిన్సిపాల్ డి.వి.బాబు, ప్రధానోపాధ్యాయురాలు అద్దంకి పద్మావతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయోత్సవ సభను విజయప్రదం చేశారు.

# ఫ్యూచర్ సిటీలో సిఎం బహిరంగ సభ...పెద్దఎతున తరలివెళ్లాలి

**-కాంగ్రెస్ నేతలకు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపు**



కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి: వక్కన రంగారెడ్డి జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 8 ప్రభాతవార్త:**

మహేశ్వరం నియోజకవర్గంలో ఈ నెల 10వ తేదీన భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే సిఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని మల్లాపూర్ లో స్థానిక వైఎఆర్ కన్వెన్షన్‌లో బాలాపూర్, నాదర్‌గుల్, బడంగ్‌పేట్, జిల్లెలగూడ, మీర్‌పేట్, ప్రశాంతిహిల్స్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కెఎల్ఆర్ మాట్లాడుతూ భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సిడిఎ), స్కిల్ యూనివర్సిటీ భవనాలను ప్రారంభించడానికి ఈ నెల 10వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచ్చేస్తున్నారని వెల్లడించారు. ప్రారంభోత్సవాలను పురస్కరించుకొని బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గానికి మైలురాయి కానున్న ఫ్యూచర్ సిటీలో జరిగే సిఎం బహిరంగ సభను విజయవంతం చేయడానికి కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని కెఎల్ఆర్ పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థలకు నమ్మకం కలిగేలా భారత్ ఫ్యూచర్ సిటీని అన్ని విధాల అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, పార్టీకి ప్రతిష్టాత్మకమైన ఫ్యూచర్ సిటీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి సభ జయప్రదం అయ్యేలా కృషి చేయాలని ఆయన పార్టీ నేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, టిపిసిసి కార్యదర్శి, సీనియర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్, మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, మాజీ ఎంపిటిసిలు సిద్దాల దశరథ పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సామిడి గోపాల్‌రెడ్డి, నవారు మల్లారెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం పాల్గొన్నారు.

## కెఎల్ఆర్ నాయకత్వంలో కాంగ్రెస్ బలోపేతం



మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌కు రాధాకృష్ణల చిత్రపటాన్ని అందజేస్తున్న మహమ్మద్

**ఎల్.బి.నగర్, జూన్ 8 ప్రభాతవార్త:**

మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కెఎల్ఆర్), టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపేతం అవుతుందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం సీనియర్ నాయకుడు ఎస్.కె.మహమ్మద్ పేర్కొన్నారు. కొత్తపేటలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మహమ్మద్ ఆధ్వర్యంలో రాధాకృష్ణుల చిత్రపటాన్ని కేఎల్ఆర్‌కు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఫ్యూచర్ సిటీ ద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభమయ్యే ఫ్యూచర్ సిటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రంగారెడ్డి జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడానికి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు.

## ఉప్పల్ ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



ఉప్పల్‌లో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తదితరులు

**ఉప్పల్, జూన్ 8 ప్రభాతవార్త :** ఉప్పల్ జోన్‌లో పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి సుమారు 16 స్వీకరించారు. ఈ సందర్భంగా ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు పలువురు స్థానికులు సమస్యలు విన్నవించారు. ఉప్పల్ బీరప్పగడ్డలో గత కొద్ది రోజులుగా చెత్తాచెదారం తొలగించడం లేదని బీరప్పగడ్డ కాలనీ నేతలు రాచకొండ శివకుమార్ తదితరులు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి టౌన్ ప్లానింగ్ 11, ఇంజనీరింగ్ 04, రెవెన్యూ 1, మొత్తం 16 ధరఖాస్తులు స్వీకరించినట్లు జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, సంబంధిత శాఖాధికారులకు తక్షణ చర్యల కోసం పంపించినట్లు ఆమె తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ నిర్దిష్ట గడువులో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ జోన్ విభాగాధిపతులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం చేసేంతవరకు భూములు ఇవ్వం



**తురకయంజాల్ జూన్ 8,ప్రభాతవార్త**

కోహెడ సర్వేనెంబర్ 167 /1లో ఎస్సీ బీసీలకు సంబంధించిన 260 ఎకరాల భూమిని రైతుల దగ్గర అన్యాయంగా లా కొని మార్కెట్ ఏర్పాటు చేస్తున్నారని కోహెడ భూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా దళితుల భూములు లాక్కున్న కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు న్యాయం చేయాలని నేషనల్ ఎస్సీ కమిషనర్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబుకు కోహెడ రైతులు వినతి పత్రం అందజేశారు.సునీల్ కుమార్ బాబు వారు మాట్లాడుతూ 15 రోజులలో లోపల అధికారులకు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కొండ్రు పురుషోత్తం, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కందాల బల్దేవరెడ్డి, కడారి అనిల్ కుమార్, కొంతం రామ్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు

## ఆందోళన విజయవంతం చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీంద్రచారి

**హయత్ నగర్, జూన్ 8 ప్రభాతవార్త :**

కేంద్రంలో బీజేపీ పార్టీ ప్రభుత్వ ఏర్పాటు మొదలు నేటి వరకు పెరిగిన ధరలతో సామాన్య ప్రజల బతుకు భారంగా మారిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి విమర్శించారు. ధరల పెరుగుదలకు నిరసనగా ఈ నెల 10న సిపిఐ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం ఆర్ఎన్ఆర్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ... నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి అయినప్పటి నుండి నేటి వరకు పెట్రోల్, డిజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా పెరిగాయన్నారు. కార్పొరేట్ సంస్థల రుణాలు మాఫీ చేసి వాటిని భర్తీ చేయటానికి ధరలను పెంచి పేద, సామాన్య ప్రజలను మోడీ దోచుకుంటున్నాడని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలని తక్షణమే తగ్గించి సామాన్యునికి అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ అబ్దుల్లా పూర్ మెట్ మండల కమిటీ సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహ పాల్గొన్నారు.

## కర్మాన్‌ఘాట్ హనుమాన్ దర్శనం చేసుకున్న మంత్రి వాకిడి శ్రీహరి



హనుమాన్ దర్శనంలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు

**సైదాబాద్, జూన్ 8 ప్రభాతవార్త:** కర్మాన్ ఘాట్ హనుమాన్ దేవాలయాన్ని రాష్ట్ర పశుసంవర్ధక యువజన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు సోమవారం సందర్శించారు. మంత్రి పదవి స్వీకరించి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా సతీసమేతంగా హనుమాన్ దేవాలయానికి వచ్చి స్వామివారికి పూజలు నిర్వహించారు. దేవాలయం కార్యనిర్వాహణాధికారి ఎన్ లావణ్య, అర్చకులు సిబ్బంది మంత్రికి సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం మంత్రి దంపతులకు వేద ఆశీర్వచనం అందజేసి స్వామివారి శేష వస్త్రములు ప్రసాదాన్ని అందజేశారు.

## ఈటల నాయకత్వంలో అభివృద్ధి



ఎంపీ ఈటల రాజేందర్‌కు అభినందన పటాన్ని అందజేస్తున్న అధ్యక్షులు

**ఎల్.బి.నగర్, జూన్ 8 ప్రభాతవార్త:**

మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ నాయకత్వంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని బిజెపి డివిజన్ అధ్యక్షులు పేర్కొన్నారు. పార్లమెంటు సభ్యులుగా గెలిచి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు సోమవారం ఈటెల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందన పటాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను ఎంపీ సానుకూలంగా స్పందించి వాటి పరిష్కారానికి ఆయన కృషి చేశారని తెలిపారు. రానున్న రోజుల్లో ఈటెల నాయకత్వంలో మరింత బలంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 8 డివిజన్ల అధ్యక్షులు దాసరి జయప్రకాష్, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, పంగ శ్రీకాంత్, నవీన్‌యాదవ్, రాజేష్, గంగాని శ్రీనివాస్, ఎరుకల మల్లేశ్‌గౌడ్, కటారి విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలో అందించిన విజయరంగకు ఘన సత్కారం



డాక్టర్ విజయరంగను సన్మానిస్తున్న దృశ్యం

**సైదాబాద్ జూన్ 8 ప్రభాతవార్త:**

లైన్స్‌క్లబ్ ద్వారా పేద ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న కొత్తపేట లైన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు, రీజియన్ ఛైర్మన్ డాక్టర్ బి.విజయరంగా చేసిన ఉత్తమ సేవలను గుర్తిస్తూ ఆయనకు సోమవారం ఘన సత్కారం చేశారు. ప్రపంచవ్యాప్తంగా 109 సంవత్సరాలు పూర్తి చేసుకున్న లయన్స్‌క్లబ్స్ అంతర్జాతీయ వేడుకలను పురస్కరించుకుని జూన్ 5 నుండి 7 వరకు నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట 13వ వార్షికోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించింది. డాక్టర్ బి.విజయరంగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనేక సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందుకు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో క్లబ్‌కు విశేషసేవలు అందించిన పాస్ట్‌ప్రెసిడెంట్స్ కందుకూరి శ్రీనివాస్, ఎంపి.విజయరెడ్డి, సైకం రేణుకరెడ్డి, కర్ణ శ్రీనివాస్‌రావులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయరంగ మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధి కోసం తమ విలువైన సూచనలు అందించాలని,రాబోయే రోజుల్లో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని, అందరి సహకారం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్‌రెడ్డి, నూతన అధ్యక్షురాలు అన్నెం కార్తీక, డాక్టర్ జవహర్, సంగీత, ఉమానాయుడు, ఎజెకియా గూటీ, కూకనూర్ రంజిత్‌రెడ్డి, పి.చంద్రశేఖర్, ఎలమందరావు పాల్గొన్నారు.

## అమ్మ నాన్న పౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం



అమ్మనాన్న జ్ఞాన మందిరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, వంశరాజ్ సంఘం నేతలు

**రామంతాపూర్, జూన్ 8 ప్రభాతవార్త :** అమ్మ నాన్న జ్ఞాన మందిరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మన్నెమ్మ వంశరాజ్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగజీవ తిరుపతయ్య వంశరాజ్ అధ్యక్షతన రామంతపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత నెల రోజులుగా వేసవి శిబిరం, కరాటే స్పోకెన్ ఇంగ్లీష్ యోగ తదితర శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి ముఖ్యఅతిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాశం యాదగిరి మాట్లాడుతూ పేద కుటుంబం నుంచి వచ్చిన తిరుపతయ్య తన ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది పేద విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయడం అభినందనీయమన్నారు. నెల రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు నిర్వహించడం చాలా అభినందనీయమని కొనియాడారు. సమాజంలో వీరు ఎంతోమందికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా గురూజీ ఆచార్య రమేష్ ఆధ్వర్యంలో పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు తవిడబోయిన గిరిబాబు, సుర్వి మురళి గౌడ్, వంశరాజ్ సంఘం నేతలు చిటికెల కృష్ణయ్య, రాసని బాలస్వామి, పాయసం గోపాల్, చిన్నకృష్ణ వెంకటయ్య, చందు, చిటికెల రామకృష్ణ, జి.వీరస్వామి, మల్లేష్, సురేష్, బాలు, బాలస్వామి, నరసింహ తదితరులు పాల్గొన్నారు

## మల్లికార్జుననగర్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం



మల్లికార్జుననగర్‌లో జరిగిన హిందూ సమ్మేళనంలో పాల్గొన్న వెల్దాడ రాఘవేంద్ర శర్మ, వడ్లూరి ఆంజనేయరాజు తదితరులు

**ఉప్పల్, జూన్ 8 ప్రభాతవార్త :** చిలుకానగర్ మల్లికార్జుననగర్ కాలనీలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.హిందూ సమ్మేళన నిర్వహణ సమితి మల్లికార్జుననగర్ కాలనీ అధ్యక్షులు చింతపట్ల బ్రహ్మాచారి, చిలుకానగర్ శాఖ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ సంఘి స్వామి యాదవ్, సబ్బాని సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా వెల్దాడ రాఘవేంద్ర శర్మ, ముఖ్య వక్తగా శ్రీ వడ్లూరి ఆంజనేయ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశభక్తితో పాటు దైవభక్తి సనాతన ధర్మం యొక్క విశిష్టతను హిందువుల ఐక్యత గురించి ఆధ్యాత్మిక భావాలను పెంచుకొని సమాజం యొక్క శ్రేయస్సుకోసం పనిచేయాలని కోరారు. హిందూ సమాజం చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా భరతనాట్యం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యమ్రకంలో మల్లికార్జుననగర్ కాలనీ మల్లన్న బస్తీ, చిలుకానగర్‌కు చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శేషాద్రినగర్‌లో సిసి రోడ్ల పనులు ప్రారంభం



రోడ్ల పనుల కోసం జెసిబికి, భూమికి పూజలు చేసిన బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 8 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్‌లోని అల్మాస్‌గూడ శేషాద్రినగర్ కాలనీలో రూ.87 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణపు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాలనీలో సోమవారం ఉదయం ఏఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి స్థానిక కాలనీవాసులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి జెసిబికి పూజలు చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రోడ్ల సమస్య ఎట్టకేలకు పరిష్కారం అయ్యిందని అనానరు. తమ కృషి ఫలితంగానే రోడ్ల నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు సోమయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, శంకర్, రాకేష్, లక్ష్మీకాంత్‌రెడ్డి, జగత్‌రెడ్డి, మహేష్, వెంకటేశ్‌గుపానపత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సన్మానించిన శివ శంకర్

**వనస్థలిపురం. జూన్, 8.ప్రభాతవార్త.**



లోయర్ ట్యాంక్ బండ్ వద్ద గల అంబేద్కర్ భవన్ ను తీసి 10 అంతస్థుల నూతన భవనం నిర్మాణం చేయుటకు 108 కోట్ల రూపాయలు మంజూరు చేసినందుకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గంగం శివశంకర్ కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డి.సుదర్శన్ బాబు , జాతీయ అధ్యక్షులు రాగాల నాగేశ్వరరావు , ఎల్బీనగర్ అధ్యక్షులు బాలాజీ గైక్వాడ్ , రాష్ట్ర మాజీ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి నిర్మల తదితరులు.

## సిఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపిక అందజేసిన రాజేష్

**ఉప్పల్, జూన్ 8 ప్రభాతవార్త :**

ఉప్పల్ భగాయత్‌లో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనను కలిసి జ్ఞాపికలు అందజేశారు. చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డికి దశ అవతారాల ఫ్రేమ్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి తనను సిఎం రేవంత్ రెడ్డికి పరిచయం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ములకలపల్లి రాజేష్ ముదిరాజ్‌ను అభినందించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



సిఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ తదితరులు